సంచలన దినపత్రిక
# హంస కలం వార్త
PRGI :T/TG/2026/0126/4786/1242




తెలంగాణ - ఆంధ్రప్రదేశ్,సంపుటి :01,సంచిక :92,చీఫ్ ఎడిటర్ : వడ్ల మధుసూదన్ చారి,వెల రూ. 4/-, సోమవారం 20 - 04 - 2026

## ఒప్పందం కుదరకుంటే మళ్లీ బాంబులే

- డీల్ కుదరకుంటే మళ్లీ బాంబుల దాడులు తప్పవని హెచ్చరిక
- ట్రంప్ వాదనలు పూర్తిగా అబద్ధమని కొట్టిపారేసిన ఇరాన్
- యురేనియం నిల్వలను తరలించే ప్రసక్తే లేదని స్పష్టీకరణ



అణు ఒప్పందం విషయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఇరాన్ మధ్య మాటల యుద్ధం తీవ్రస్థాయికి చేరింది. వచ్చే బుధవారం లోపు ఒప్పందం ఖరారు కాకపోతే ఇరాన్‌పై మళ్లీ బాంబు దాడులు ప్రారంభిస్తామని ట్రంప్ హెచ్చరికలు జారీ చేశారు. అయితే, ట్రంప్ వాదనలను ఇరాన్ ప్రభుత్వం తీవ్రంగా ఖండించింది. అవన్నీ అబద్ధాలని కొట్టిపారేసింది. హమాస్, హిజ్బుల్లా వంటి సంస్థలకు నిధులు ఆపడానికి, అణు కార్యక్రమాన్ని నిరవధికంగా నిలిపివేయడానికి ఇరాన్ అంగీకరించిందని ట్రంప్ తెలిపారు. ఇరాన్‌లోని శుద్ధిచేసిన యురేనియం నిల్వలను కూడా అమెరికాకు - మిగతా 2 లో

## అమెరికాకు యురేనియం ఇచ్చేది లేదు.. తేల్చి చెప్పిన ఇరాన్

- అమెరికాకు యురేనియం బదిలీ చేసే ప్రసక్తే లేదన్న ఇరాన్
- పాత ఒప్పందం ప్రకారమే హర్మూజ్ జలసంధిలో నౌకలకు అనుమతి
- అమెరికా నావికా దిగ్బంధనంపై తీవ్రంగా స్పందించిన టెహ్రాన్
- పాకిస్థాన్ మధ్యవర్తిత్వంతో చర్చల కొనసాగింపు



తమ వద్ద ఉన్న శుద్ధిచేసిన యురేనియంను ఏ దేశానికీ బదిలీ చేసే ప్రసక్తే లేదని ఇరాన్ స్పష్టం చేసింది. ముఖ్యంగా అమెరికాకు యురేనియంను పంపే అంశం ఎన్నడూ తమ పరిశీలనలో కూడా లేదని తేల్చి చెప్పింది. ఇరాన్ విదేశాంగ శాఖ ప్రతినిధి ఇస్మాయిల్ బఘాయీ ప్రభుత్వ టీవీ - మిగతా 2 లో

## నిన్న మహిళలకు జరిగిన ద్రోహాన్ని
# ప్రతి ఇంటికీ తీసుకెళతాం

- మహిళా రిజర్వేషన్ బిల్లును అడ్డుకున్న విపక్షాలపై నిడదవోలులో ఎన్డీఏ నిరసన
- బిల్లును అడ్డుకుని విపక్షాలు జాతికి ద్రోహం చేశాయని మండిపడ్డ చంద్రబాబు
- పార్లమెంట్‌లో జరిగిన పరిణామం ప్రజాస్వామ్య చరిత్రలో ఒక బ్లాక్ డే అని వ్యాఖ్య
- విపక్షాల ద్రోహాన్ని ప్రతి ఇంటికీ తీసుకెళ్తామని, ఇది ఆరంభం మాత్రమేనని హెచ్చరిక
- కుట్ర చేసిన పార్టీలకు డిపాజిట్లు రాకుండా చేయాలని ప్రజలకు పిలుపు




పార్లమెంటులో మహిళా రిజర్వేషన్ బిల్లును అడ్డుకోవడం ద్వారా కాంగ్రెస్ నేతృత్వంలోని విపక్షాలు జాతికి ద్రోహం చేశాయని ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. భారత ప్రజాస్వామ్య చరిత్రలో నిన్నటి రోజు ఒక బ్లాక్ డే అని ఆయన అభివర్ణించారు.

## దత్తపుత్రుడు జగన్ గారి తెర తొలగింది

2 లో..



లోక్ సభలో వీగిపోయిన రాజ్యాంగ సవరణ బిల్లు ఆ బిల్లును అడ్డుకుని ఏం సాధించారంటూ కాంగ్రెస్ సహా విపక్షాలను ప్రశ్నించిన జగన్ జగన్ పై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తిన ఏపీ కాంగ్రెస్ చీఫ్ షర్మిల జగన్, బీజేపీ మధ్య రహస్య పొత్తు తేటతెల్లమైందని వెల్లడి కేసుల నుంచి రక్షణ పొందేందుకే కేంద్రానికి జగన్ దాసోహమన్నారని వ్యాఖ్యలు వైఎస్ఆర్ ఆశయాలకు జగన్ తూట్లు పొడిచారని తీవ్ర విమర్శ వైసీపీ అధ్యక్షుడు జగన్ పై ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్రస్థాయిలో - మిగతా 2 లో

## రూ.16 కోట్ల ఇంజెక్షన్ తో పునర్జన్మ



- చిన్నారి పునర్విక ప్రాణాలు కాపాడిన మంత్రి నారా లోకేష్
- అరుదైన వ్యాధితో బాధపడుతున్న చిన్నారి పునర్విక
- రూ.16 కోట్ల విలువైన ఇంజెక్షన్ ఒక్కటే మార్గం
- ప్రజల సాయంతో రూ.10 కోట్లు, మిగిలిన మొత్తానికి లోకేష్ హామీ

ఇంజెక్షన్‌ను విదేశాల నుంచి తెప్పించిన మంత్రి లోకేష్ సమక్షంలో చిన్నారికి జీన్ థెరపీ ఇంజెక్షన్ ఇచ్చిన వైద్యులు ప్రాణం- మిగతా 2 లో

## అంబటి రాంబాబు నిరాహారదీక్ష

### ఎవరినీ వదిలిపెట్టను అంటూ వార్నింగ్



ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 వరకు దీక్ష తన ఇంటిపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోలేదని నిరసనఇద్దరు సీఐలను సస్పెండ్ చేయాలని డిమాండ్ వైసీపీ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు నిరాహార దీక్ష చేపట్టారు. తన ఇల్లు, కార్యాలయంపై జరిగిన దాడికి నిరసనగా, నిందితులను అరెస్ట్ చేయాలనే డిమాండ్‌తో అంబటి నేడు ఉదయం 6 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు దీక్షకు దిగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ - మిగతా 2 లో

## ఓటర్ల జాబితా వివాదం సోనియా గాంధీపై కేసు నేడు ఢిల్లీ కోర్టులో విచారణ



- భారత పౌరసత్వం పొందకముందే ఓటర్ల జాబితాలో పేరు చేర్చారన్న ఆరోపణలు
- సోనియా గాంధీపై దాఖలైన క్రిమినల్ రివిజన్ పిటిషన్‌పై ఢిల్లీ కోర్టులో విచారణ
- పిటిషనర్ వాదనలు పూర్తి.. సోనియా తరఫు న్యాయవాది వాదనల కొనసాగింపు
- ఈ ఆరోపణలు రాజకీయ ప్రేరేపితమని, నిరాధారమని కొట్టిపారేసిన సోనియా గాంధీ

భారత పౌరసత్వం పొందకముందే ఓటర్ల జాబితాలో అక్రమంగా పేరు చేర్చుకున్నారనే ఆరోపణలపై కాంగ్రెస్ నాయకురాలు - మిగతా 2 లో

## విపక్షాలు భారీ మూల్యం
# చెల్లించుకుంటాయ్

- జీవితాంతం ఆ విషయంలో చింతిస్తాయ్: మోదీ
- విపక్షాలు జీవితాంతం పశ్చాత్తాపపడతాయని ప్రధాని మోదీ వ్యాఖ్యలు
- మహిళల హక్కులను అడ్డుకున్నారని కిరణ్ రిజిజు ఆరోపణలు
- మహిళల ఆశలను తుంగలో తొక్కినట్లయిందన్న మోదీ
- మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించాలనే లక్ష్యంతో పాటు, డీలిమిటేషన్ ప్రక్రియ




పార్లమెంటులో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించేందుకు తీసుకొచ్చిన కీలక రాజ్యాంగ సవరణ బిల్లు ఆమోదం పొందకపోవడంపై ప్రధాని నరేంద్రమోదీ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. విపక్షాల వైఖరి దేశ మహిళలకు అన్యాయం చేసిందని, ఈ విషయంలో వారు జీవితాంతం చింతించాల్సి వస్తుందని మండిపడ్డారు. కేంద్ర కేబినెట్ సమావేశంలో ఈ అంశంపై మోదీ స్పష్టంగా స్పందించినట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. మహిళల ఆశలను తుంగలో తొక్కినట్లయిందన్న మోదీ శనివారం జరిగిన కేంద్ర కేబినెట్ సమావేశానికి అధ్యక్షత వహించిన మోదీ, మహిళా రిజర్వేషన్ బిల్లును

## హర్మూజ్ మళ్లీ మూసివేత
## ఇరాన్ సంచలన నిర్ణయం




- హర్మూజ్ జలసంధిపై మళ్లీ కఠిన నియంత్రణ విధించిన ఇరాన్
- తెరిచిన రెండు రోజులకే ఆ మార్గాన్ని తిరిగి మూసివేస్తున్నట్లు ప్రకటన
- అమెరికా నేవీ దిగ్బంధనం కొనసాగించడమే కారణమని ఆరోపణ
- తాజా పరిణామాలతో మధ్యప్రాచ్యంలో మళ్లీ ఉద్రిక్తతలు
- ప్రపంచ ఆయిల్ సరఫరాపై ప్రభావం చూపే అవకాశం

అమెరికాతో ఉద్రిక్తతల నేపథ్యంలో ఇరాన్ సంచలన నిర్ణయం తీసుకుంది. వ్యూహాత్మకమైన హర్మూజ్ జలసంధిని మళ్లీ మూసివేసింది. హర్మూజ్ పై మళ్లీ కఠిన నియంత్రణ విధిస్తున్నట్లు నేడు ఓ ప్రకటనలో తెలిపింది.

## ఉద్యమం చేసిన సాధించిన తెలంగాణను తేజస్వీ అవమానించారు




- తేజస్వీ మాట్లాడుతుంటే బీజేపీ ఎంపీలు నోరు మెదపలేదని విమర్శ
- తేజస్వీ చేసిన వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించాలని డిమాండ్
- మహిళా రిజర్వేషన్ బిల్లును ప్రవేశపెడితే కాంగ్రెస్ మద్దతిస్తుందని వ్యాఖ్య

దశాబ్దాలుగా ఉద్యమం చేసి సాధించుకున్న తెలంగాణను బీజేపీ కర్ణాటక ఎంపీ తేజస్వీ సూర్య అవమానించారని

## రేవంత్ సభను విజయవంతం చేయాలి



- సోమవారం కాటారంలో సీఎం రేవంత్ కార్యక్రమం
- మంథని క్యాంప్ కార్యాలయంలో శ్రీధర్ బాబు సమీక్ష సమావేశం
- కార్యక్రమంలో పాల్గొననున్న ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'రైతు భరోసా' నిధుల విడుదల కార్యక్రమాన్ని చారిత్రాత్మక- మిగతా 2 లో



పండాల సతీష్ గౌడ్, GHMC మాజీ కార్పోరేటర్-ఫత్తేనగర్ డివిజన్

# దక్షిణాది రాష్ట్రాలను ఒప్పించే బాధ్యత నేను తీసుకుంటా

**మొదటిపేజీ తరువాయి** – ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల లోపు నాటి మహిళా రిజర్వేషన్‌ను అమలు చేస్తే మద్దతిచ్చేందుకు తాము సిద్ధంగా ఉన్నామని అన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లుకు కాంగ్రెస్ వ్యతిరేకమన్నది అబద్ధమని పేర్కొన్నారు. ప్రస్తుతం ఢిల్లీ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శనివారం ఉదయం కాంగ్రెస్ పెద్దలను కలిసి బిల్లు వీగిపోయినందుకు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, 131వ రాజ్యాంగ సవరణ బిల్లు లోక్ సభలో వీగిపోవడంతో దేశానికి పెద్ద ప్రమాదం తప్పిందని వ్యాఖ్యానించారు. బిల్లు వీగిపోవడం రాజకీయ ఓటమి కాదని, బీజేపీ విధానాలకు జరిగిన ఓటమి అని అభివర్ణించారు. ఎన్డీయే మూడు బిల్లుల పేరుతో డీలిమిటేషన్ అమలుకు కుట్ర చేసిందని ఆరోపించారు. దక్షిణ భారతదేశానికి జరిగే అన్యాయాన్ని అడ్డుకుంటామని అన్నారు. మహిళా రిజర్వేషన్లను చిన్న సవరణలతో అమలు చేయవచ్చని అన్నారు. బీజేపీకి 400కు పైగా సీట్లు వస్తే రాజ్యాంగాన్ని మార్చేదని ఆరోపించారు. మహిళా రిజర్వేషన్లకు తాము వ్యతిరేకం కాదని పునరుద్ఘాటించారు. సోమవారం ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలను ఏర్పాటు చేసి కేవలం మహిళా రిజర్వేషన్ బిల్లును మాత్రమే పెడితే ఇండియా కూటమి ఏకగ్రీవంగా మద్దతిచ్చేందుకు సిద్ధంగా ఉందని అన్నారు. దక్షిణాది రాష్ట్రాలను ఒప్పించే బాధ్యత తనదేనని తెలిపారు. మహిళా రిజర్వేషన్లలో కూడా ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ కోటాలు ఉండాలని కోరారు. డీలిమిటేషన్ పేరుతో ఉత్తరాది, దక్షిణాది మధ్య చిచ్చుపెట్టవద్దని ముఖ్యమంత్రి కోరారు. డీలిమిటేషన్ పేరుతో లోక్ సభ సీట్లను 850కి పెంచి బీజేపీ శాశ్వతంగా అధికారంలో ఉండాలనే కుట్ర చేసిందని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీకి రాజకీయాల కంటే దేశమే ముఖ్యమని రేవంత్ రెడ్డి అన్నారు. మహిళా రిజర్వేషన్లను అమలు చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. ఇందిరాగాంధీ వంటి గొప్ప నేతలు కాంగ్రెస్ పార్టీ తరఫున దేశాన్ని నడిపించారని, బీజేపీ నుంచి ఇప్పటి వరకు మహిళ పార్టీ అధ్యక్షురాలు కాలేదని విమర్శించారు. ప్రతి విషయంలో కాంగ్రెస్ పార్టీ మహిళలకు ప్రాధాన్యత ఇచ్చిందని రేవంత్ రెడ్డి అన్నారు.

# రూ.16 కోట్ల ఇంజెక్షన్ తో పునర్జన్మ

**మొదటిపేజీ తరువాయి** – నిలిపిన లోకేష్‌కు, దాతలకు కన్నీళ్లతో కృతజ్ఞతలు తెలిపిన తల్లిదండ్రులు లక్షల హృదయాల ప్రార్థనలు ఓవైపు, మంత్రి నారా లోకేశ్ కృషి మరోవైపు... అరుదైన వ్యాధితో బాధపడుతున్న చిన్నారి పునర్విక ప్రాణాన్ని నిలబెట్టాయి. కొన్ని నెలలుగా 'సేవ్ పునర్విక' అంటూ సామాజిక మాధ్యమాల్లో సాగిన మానవతా ఉద్యమానికి సార్థకత లభించింది. ఆ పసిమొగ్గకు ప్రాణం నిలిచింది. అరుదైన స్పైనల్ మస్క్యులర్ అట్రోఫీ (రాపీూ టైప్-1) వ్యాధితో ప్రాణాలతో పోరాడుతున్న ఏడాది చిన్నారి పునర్వికకు మంత్రి నారా లోకేష్ రూపంలో అందిన ఆపన్నహస్తం, పునర్జన్మను ప్రసాదించింది. మాటలతో చెప్పలేని ఆవేదన నుంచి ఆనందభాష్పాలు రాల్చే క్షణాలకు ఈ కథ నిలువుటద్దం. అన్నగా అండగా నిలుస్తానని ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ, రూ.16 కోట్ల విలువైన జీవన సంజీవనిని అందించి, ఆ చిట్టి చెల్లెలి చిరునవ్వును కాపాడారు లోకేష్. హైదరాబాద్‌లోని రెయిన్‌బో ఆసుపత్రిలో మంత్రి లోకేష్ సమక్షంలోనే వైద్యులు శనివారం ఉదయం ఆ ఇంజెక్షన్ ను పునర్వికకు అందించారు. ఈ ఘట్టంతో కొన్ని నెలలుగా సాగిన "సేవ్ పునర్విక" ఉద్యమం విజయవంతంగా ఫలించింది. కర్నూలు జిల్లా వెల్దుర్తికి చెందిన జంపాల మంగళ సురేష్ కుమార్, పుష్పావతి దంపతుల కుమార్తె పునర్విక. క్షవరం వృత్తి చేసుకుని జీవనం సాగించే సురేష్ కుమార్ కుటుంబానికి, తమ కుమార్తెకు ప్రాణాంతక వ్యాధి సోకిందని తెలియడంతో మిన్ను విరిగి మీద పడ్డట్టయింది. పుట్టిన ఆరు నెలలైనా చిన్నారిలో కదలికలు లేకపోవడంతో ఆందోళన చెందిన తల్లిదండ్రులు, హైదరాబాద్ రెయిన్‌బో ఆసుపత్రిని ఆశ్రయించారు. అక్కడ వైద్యులు పునర్వికకు స్పైనల్ మస్క్యులర్ అట్రోఫీ సోకినట్టు నిర్ధారించారు. ఈ వ్యాధికి అమెరికా నుంచి తెప్పించే రూ.16 కోట్ల విలువైన ఇంజెక్షన్ ఒక్కటే మార్గమని తేల్చిచెప్పారు. దీంతో కన్నీరుమున్నీరైన ఆ తల్లిదండ్రులు, తమ కుమార్తెను కాపాడుకోవడానికి దాతల సహాయం కోరుతూ ఈ ఏడాది జనవరిలో సోషల్ మీడియా వేదికగా అభ్యర్థించారు. "సేవ్ పునర్విక" పేరుతో సాగిన ఈ ప్రచారానికి లక్షలాది హృదయాలు స్పందించాయి. ఫిబ్రవరి నాటికి సుమారు రూ.10 కోట్ల విరాళాలు సమకూరాయి. అయినా, ఇంకా భారీ మొత్తంలో డబ్బు అవసరం కావడంతో, తల్లిదండ్రులు ఎక్స్ ద్వారా మంత్రి నారా లోకేష్‌ను సాయం కోరారు. వారి విజ్ఞప్తికి తక్షణమే స్పందించిన మంత్రి లోకేష్, చిన్నారి బాధ్యతను తాను తీసుకుంటానని, చికిత్సకు అవసరమైన పూర్తి సాయం అందిస్తానని భరోసా ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం, కేవలం ఆర్థిక సహాయం ప్రకటించడమే కాకుండా, చికిత్స ప్రక్రియను మొదటి నుంచి చివరి వరకు అన్నీతానై పర్యవేక్షించారు. రూ.16 కోట్ల ఇంజెక్షన్‌ను అమెరికా నుంచి హైదరాబాద్‌కు వేగంగా రప్పించేందుకు తన సిబ్బంది ద్వారా నిరంతరం సమన్వయం చేశారు. ఔషధ తయారీ సంస్థ నోవార్టిస్, రెయిన్‌బో ఆసుపత్రి యాజమాన్యం, వైద్యులతో మాట్లాడి ప్రక్రియను వేగవంతం చేశారు. ప్రభుత్వ ధృవపత్రాలు, చెల్లింపులు, రవాణా వంటి అన్ని అడ్డంకులను తొలగించి, ఇంజెక్షన్ సకాలంలో అందేలా చూశారు. చిన్నారికి ఇంజెక్షన్ ఇస్తున్న సమయంలో ఆసుపత్రిలోనే ఉన్న లోకేష్, కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఏడుస్తున్న పునర్వికను ఎత్తుకుని లాలించారు. అనంతరం వైద్యులతో మాట్లాడి చికిత్స వివరాలు తెలుసుకున్నారు. తమ కుమార్తెకు జన్మనిచ్చింది తామైతే, పునర్జన్మ ప్రసాదించింది మంత్రి లోకేష్, దాతలని పునర్విక తల్లిదండ్రులు భావోద్వేగంతో కృతజ్ఞతలు తెలిపారు. లోకేష్ చేసిన సహాయాన్ని జీవితాంతం మరువలేమని, భవిష్యత్తులోనూ అండగా ఉంటానని ఆయన భరోసా ఇచ్చారని సంతోషం వ్యక్తం చేశారు. వైద్యులు, దాతలు, ప్రార్థించిన ప్రతి ఒక్కరికీ వారు శిరస్సు వంచి నమస్కారాలు తెలియజేశారు.

# నిన్న మహిళలకు జరిగిన ద్రోహాన్ని ప్రతి ఇంటికీ తీసుకెళతాం

**మొదటిపేజీ తరువాయి** – మహిళా బిల్లును అడ్డుకున్న విపక్షాల వైఖరికి నిరసనగా తూర్పు గోదావరి జిల్లా నిడదవోలులో ఎన్డీఏ భాగస్వామ్య పక్షాలు శనివారం భారీ నిరసన ర్యాలీ చేపట్టాయి. ఈ ర్యాలీ అనంతరం చంద్రబాబు మీడియాతో మాట్లాడి, విపక్షాల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. "మహిళలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లు కల్పించే సుదీర్ఘ కల సాకారం అవుతుందని దేశమంతా ఆశగా ఎదురుచూసింది. కానీ, కాంగ్రెస్ నాయకత్వంలోని ప్రతిపక్షాలు తమ సంకుచిత రాజకీయ అజెండా కోసం ఈ చారిత్రక బిల్లును అడ్డుకుని దుర్మార్గానికి పాల్పడ్డాయి. ఎక్కడ స్త్రీలను పూజిస్తారో అక్కడ దేవతలుంటారని నమ్మే సంస్కృతి మనది. కానీ, పార్లమెంటులో అందుకు భిన్నంగా మహిళల ఆత్మాభిమానాన్ని దెబ్బతీశారు. దశాబ్దాలుగా పోరాడుతున్న మహిళా రిజర్వేషన్లను అడ్డుకోవడం క్షమించరాని నేరం" అని చంద్రబాబు మండిపడ్డారు. ఈ బిల్లు ఆమోదం పొంది ఉంటే దక్షిణాదికి, చిన్న రాష్ట్రాలకు అన్యాయం జరగదని ప్రధానమంత్రి, హోంమంత్రి స్పష్టమైన హామీ ఇచ్చారని చంద్రబాబు గుర్తుచేశారు. "సీట్లు 50 శాతం మేర పెరుగుతాయని, ఆంధ్రప్రదేశ్‌లో కూడా అదే స్థాయిలో సీట్లు పెరిగేవని స్పష్టంగా చెప్పారు. అయినప్పటికీ, ఉత్తరాదికి, దక్షిణాదికి అన్యాయం జరుగుతుందంటూ లేనిపోని సాకులు చెప్పి,



మెజారిటీ సభ్యుల మద్దతు రాకుండా కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు కుట్రపూరితంగా అడ్డుకున్నాయి. ఆడబిడ్డలంటే విపక్షాలకు ఇంత చులకనా?" అని ఆయన ప్రశ్నించారు. ఈ అంశంపై జనసేన అధినేత పవన్ కల్యాణ్‌తో మాట్లాడానని, ఎన్డీఏ పక్షాలతో పాటు ఇతర పార్టీలు కూడా కలిసి రావాలని పిలుపునిచ్చారు. 2017లోనే టీడీపీ ప్రభుత్వం మహిళా రిజర్వేషన్ల కోసం అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపిందని గుర్తుచేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు కనీసం బిల్లు కూడా తీసుకురాలేకపోయిందని విమర్శించారు. 2029 నుంచి మహిళలకు రిజర్వేషన్లు కల్పించాలనే సదుద్దేశంతో సవరణ బిల్లు తీసుకువస్తే, దానిని నీరుగార్చడం శోచనీయమన్నారు. "నిన్న జరిగిన ఈ విద్రోహాన్ని ప్రతి ఇంటికీ తీసుకెళతాం. ఇవాళ చేపట్టిన నిరసన కేవలం ఆరంభం మాత్రమే. జనాభాలో 50 శాతంగా ఉన్న మహిళలు అన్ని రంగాల్లో సమర్థవంతంగా రాణిస్తున్నారు. అలాంటి వారు చట్టసభల్లోకి వస్తే సమాజానికి న్యాయం జరుగుతుంది. ఆడబిడ్డలు పైకి వస్తే చూడలేని ఈర్ష్యతోనే బిల్లును అడ్డుకున్నారు. ఈ ద్రోహానికి పాల్పడిన పార్టీలకు వచ్చే ఎన్నికల్లో డిపాజిట్లు కూడా రాకుండా ప్రజలు బుద్ధి చెప్పాలి. ఈ వ్యవహారంపై ప్రతి ఒక్కరినీ చైతన్యపరిచేందుకు రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున కార్యక్రమాలు చేపడతాం" అని చంద్రబాబు స్పష్టం చేశారు.

# దత్తపుత్రుడు జగన్ గారి తెర తొలగింది

**మొదటిపేజీ తరువాయి** – విరుచుకుపడ్డారు. బీజేపీతో జగన్ అక్రమ పొత్తు బట్టబయలైందని, విపక్షం ముసుగులో ఉన్నది ఆర్ఎస్ఎస్ పక్షమేనని తేలిపోయిందని ఆమె ధ్వజమెత్తారు. "దత్తపుత్రుడు జగన్ గారి తెర తొలగింది" అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. రాజ్యాంగ పరిరక్షణ కంటే బీజేపీ భజనే జగన్‌కు ముఖ్యమా అని ఆమె ప్రశ్నించారు. పార్లమెంటులో ప్రవేశపెట్టిన అక్రమ డీలిమిటేషన్ బిల్లుకు మద్దతు పలికినందుకు జగన్ సిగ్గుపడాలని అన్నారు. తన ఐదేళ్ల పాలనలో చేసిన అవినీతి, కేసుల నుంచి రక్షణ పొందేందుకే జగన్ బీజేపీకి బానిసగా మారారని షర్మిల తీవ్ర ఆరోపణలు చేశారు. "కేసుల నుంచి రక్షణ కోసం బానిసగా బ్రతకాలా? బీజేపీ బిల్లులకు గొర్రెలా గుడ్డిగా తలాడించాలా? మోదీ మెప్పుకోసం సొంత కాకిలెక్కలు అల్లాలా?" అని నిలదీశారు. మహానేత వైఎస్ఆర్ సిద్ధాంతాలను, విలువలను జగన్ మంటగలిపారని, దీనిపై ఆయన ఆత్మవిమర్శ చేసుకోవాలని హితవు పలికారు. రాజ్యాంగానికి విఘాతం కలిగించే బిల్లును విపక్షాలు అడ్డుకుంటే, ఆ బిల్లును అడ్డుకోవడం ద్వారా ఏం సాధించారని జగన్ ప్రశ్నించడం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు. ఈ దొంగ బిల్లుకు ఓటేసి జగన్ ఏం సాధించారని, కోట్లాది ఆంధ్రప్రదేశ్ ప్రజల మనోభావాలను గాయపరిచారని మండిపడ్డారు. మహిళా రిజర్వేషన్ బిల్లును డీలిమిటేషన్‌కు ముడిపెట్టడం జగన్ అవివేకానికి నిదర్శనమని షర్మిల అన్నారు. మహిళల 33 శాతం రిజర్వేషన్లకు కాంగ్రెస్ పార్టీ సహా ఎవరూ వ్యతిరేకం కాదని, కానీ బీజేపీ ప్రభుత్వం దాని అమలును ఆలస్యం చేసేందుకే డీలిమిటేషన్, జనాభా లెక్కలు అనే నిబంధనలు పెట్టిందని ఆరోపించారు. మహిళా రిజర్వేషన్లు, నియోజకవర్గాల పునర్విభజనపై తమ పార్టీ వైఖరి స్పష్టంగా ఉందని తెలిపారు. 2026 జనాభా లెక్కలు, కులగణన పూర్తయ్యాక, ఆ గణాంకాల ఆధారంగా ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు న్యాయం చేస్తూ రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. తక్షణమే ప్రస్తుతమున్న 543 లోక్‌సభ స్థానాలకే మహిళా రిజర్వేషన్లను వర్తింపజేయాలని కాంగ్రెస్ పార్టీ కోరుతోందని వివరించారు. అధికారిక ఉద్ధరిస్తున్నామని బీజేపీ చెబితే, జగన్ గుడ్డిగా నమ్మడం రాష్ట్ర ప్రజలను మోసం చేయడమేనని షర్మిల అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో బీజేపీ అంటే బాబు, జగన్, పవన్ అని, ఈ మూడు పార్టీలూ మోదీ మెప్పుకోసమే పనిచేస్తున్నాయని ఆరోపించారు. రాష్ట్రంలో నిజమైన ప్రతిపక్షం కాంగ్రెస్ పార్టీ మాత్రమేనని, ప్రజల హక్కుల కోసం పోరాడుతున్నది తామేనని ఆమె పేర్కొన్నారు.


# విపక్షాలు భారీ మూల్యం చెల్లించుకుంటాయ్

**మొదటిపేజీ తరువాయి** – అడ్డుకోవడం ద్వారా విపక్షాలు తమ అసలు స్వరూపాన్ని బయటపెట్టాయని అన్నారు. దేశంలోని ప్రతి గ్రామానికి ఈ విషయాన్ని తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. మహిళల ఆశలను తుంగలో తొక్కినట్లయిందని, ఈ నిర్ణయం రాజకీయంగా కూడా విపక్షాలకు భారీ మూల్యం చెల్లింపజేస్తుందని హెచ్చరించారు.

### బిల్లును అడ్డుకోవడం ఘోర పాపం: రిజిజు

ఇదే విషయంపై పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు కూడా తీవ్రంగా స్పందించారు. మహిళా రిజర్వేషన్ బిల్లును అడ్డుకోవడం ఘోర పాపమని ఆయన విమర్శించారు. మహిళలకు హక్కులు కల్పించే చట్టాన్ని అడ్డుకోవడం దుర్మార్గమని, దానిపై సంబరాలు చేసుకోవడం మరింత దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. బిల్లును అడ్డుకున్న విపక్ష నేతలు మహిళా వ్యతిరేకులుగా నిలిచిపోయారని అన్నారు. రాహుల్ సమాధానం చెప్పాలని డిమాండ్ లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఈ బిల్లును ఎలా అప్రజాస్వామికమని చెబుతున్నారో ప్రజలకు సమాధానం చెప్పాలని రిజిజు డిమాండ్ చేశారు. కేంద్రానికి మహిళా రిజర్వేషన్ అమలు చేయాలనే స్పష్టమైన సంకల్పం ఉన్నప్పటికీ, విపక్షాలు అడ్డంకులు సృష్టించాయని ఆరోపించారు. డీలిమిటేషన్ అంశాన్ని సాకుగా చూపిస్తూ బిల్లును అడ్డుకోవడం సరైన విధానం కాదని అన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లుకు సంబంధించిన ఓటింగ్ లోక్‌సభలో తీవ్ర ఉద్రిక్తతల మధ్య జరిగింది. మొత్తం 528 మంది సభ్యులు ఓటింగ్‌లో పాల్గొన్నారు. అందులో 298 మంది బిల్లుకు అనుకూలంగా ఓటు వేయగా, 230 మంది వ్యతిరేకంగా ఓటు వేశారు. అయితే రాజ్యాంగ సవరణ బిల్లుకు అవసరమైన రెండు మూడవ వంతు మెజారిటీ (352 ఓట్లు) రాకపోవడంతో బిల్లు తిరస్కరణకు గురైంది. బిల్లు ద్వారా లోక్‌సభ, రాష్ట్ర శాసనసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించాలనే లక్ష్యంతో పాటు, డీలిమిటేషన్ ప్రక్రియ అనంతరం స్థానాల సంఖ్యను పెంచే ప్రతిపాదన కూడా ఉంది. 2029 ఎన్నికల నాటికి ఈ రిజర్వేషన్ అమల్లోకి తీసుకురావాలని కేంద్రం భావించింది. అయితే విపక్షాలు ఈ విధానంపై అనేక అభ్యంతరాలు వ్యక్తం చేశాయి. ప్రధానంగా, డీలిమిటేషన్ తర్వాత దక్షిణ రాష్ట్రాల ప్రాతినిధ్యం తగ్గే అవకాశం ఉందని విపక్షాలు ఆందోళన వ్యక్తం చేశాయి. అలాగే, కేంద్రం రాజకీయ లాభం కోసం ఈ బిల్లును ఉపయోగించుకుంటోందని కూడా ఆరోపించాయి. మహిళా రిజర్వేషన్‌కు తమ మద్దతు ఉన్నప్పటికీ, అమలు విధానం పట్ల అభ్యంతరాలు ఉన్నాయని విపక్షాలు స్పష్టం చేశాయి. ఇక కేంద్రం మాత్రం ఈ ఆరోపణలను ఖండించింది. మహిళల సాధికారత కోసం తీసుకొచ్చిన చట్టాన్ని అడ్డుకోవడం ద్వారా విపక్షాలు తమ నిజ స్వరూపాన్ని చూపించాయని పేర్కొంది. మహిళల ఆగ్రహాన్ని వారు తప్పక ఎదుర్కోవాల్సి వస్తుందని కిరణ్ రిజిజు హెచ్చరించారు. ఈ పరిణామం దేశ రాజకీయాల్లో పెద్ద చర్చకు దారితీసింది. మహిళా రిజర్వేషన్ అంశం మరోసారి జాతీయ రాజకీయాల్లో ప్రధాన అజెండాగా మారింది. ముందున్న రోజుల్లో ఈ అంశంపై కేంద్రం, విపక్షాల మధ్య మరింత రాజకీయ పోరు కొనసాగే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# షాకిచ్చిన ఇరాన్.. హార్మూజ్ జలసంధి మళ్లీ మూసివేత.. అమెరికా వైఖరే కారణం



ప్రపంచానికి ఇరాన్ మరోసారి షాకిచ్చింది. హార్మూజ్ జలసంధిని తెరుస్తున్నట్లు ప్రకటించిన కొన్ని గంటల్లోనే తిరిగి మూసేసింది. అమెరికా అనుసరిస్న్?న్న విధానమే దీనికి కారణమని ఆరోపించింది. హార్మూజ్ జలసంధిని మూసేస్తున్నట్లు ఇరాన్‌కు చెందిన ఇస్లామిక్ రెవల్యూషనరీ గార్డ్స్ కార్ప్స్ (ఐఆర్‌జీసీ) ప్రకటించింది. ఇటీవల హార్మూజ్ జలసంధిని అమెరికా దిగ్బంధించిన సంగతి తెలిసిందే. అయితే, ఇరాన్ హార్మూజ్ జలసంధిని తెరిచినప్పటికీ, అమెరికా మాత్రం ఈ దిగ్బంధనాన్ని తొలగించలేదు. పైగా తమ నౌకల్ని అమెరికా అడ్డుకుంటోందని ఇరాన్ ఆరోపిస్తోంది. ఈ నేపథ్యంలో హార్మూజ్ జలసంధిని తిరిగి మూసేస్తున్నట్లు ఇరాన్ ప్రకటించింది. దిగ్బంధనం పేరుతో సముద్రంపై అమెరికా దోపిడీ, దౌర్జన్యానికి పాల్పడుతోందని ఇరాన్ ఆరోపించింది. అమెరికాతో కుదిరిన ఒప్పందం మేరకు హార్మూజ్‌ను తెరిచామని, అయితే, ఈ ఒప్పందాన్ని అమెరికా ఉల్లంఘించిందని ఇరాన్ విమర్శించింది. హార్మూజ్‌ను ఇరాన్ తిరిగి మూసివేడయంతో మళ్లీ గతంలోలాగే ఇరాన్ సెంట్రల్ మిలిటరీ కమాండ్ పూర్తి పర్యవేక్షణ చేపడుతోంది. సముద్ర జలాలపై గట్టి నిఘా ఉంటుందని తెలిపింది. ఇరాన్ నిర్ణయంతో ఈ జలసంధి నుంచి నౌకల రవాణా నెమ్మదించింది. హార్మూజ్‌ను అమెరికా దిగ్బంధించినంతకాలం తాము జలసంధిని మూసివేసి ఉంచుతామని ఇరాన్ ప్రకటించింది. అయితే, ఈ విషయంలో అమెరికా వైఖరి భిన్నంగా ఉంది. తమతో ఒప్పందం కుదుర్చుకునే వరకు హార్మూజ్ దిగ్బంధనం కొనసాగుతుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నారు. ఇదే సమయంలో ఇరాన్ తమ దేశంలోని పలు ఎయిర్‌పోర్టులను తిరిగి తెరుస్తున్నట్లు ప్రకటించింది. తూర్పు మార్గంలో అంతర్జాతీయ విమానాల రాకపోకలకు అనుగుణంగా అనుమతులిస్తున్నట్లు ఇరాన్ సివిల్ ఏవియేషన్ ఆర్గనైజేషన్ ప్రకటించింది. హార్మూజ్‌కు సంబంధించి.. దీన్ని ఇంకొంతకాలం ఇలాగే మూసి ఉంచితే ప్రపంచం మళ్లీ సంక్షోభంలో కూరుకుపోవడం ఖాయం. చమురు ధరలు కూడా భారీగా పెరుగుతాయి.

# ఉద్యమం చేసిన సాధించిన తెలంగాణను తేజస్వీ అవమానించారు

**మొదటిపేజీ తరువాయి** – తెలంగాణ రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును ఆయన అవమానిస్తుంటే తెలంగాణ బీజేపీ ఎంపీలు నోరు కూడా మెదపలేదని విమర్శించారు. తేజస్వీ సూర్య చేసిన వ్యాఖ్యలు పార్లమెంట్ రికార్డుల్లో ఉండకూడదని డిమాండ్ చేశారు. డీలిమిటేషన్ బిల్లుతో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం చేసే ప్రయత్నాన్ని విపక్షాలు అడ్డుకున్నాయని మంత్రి అన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లును డీలిమిటేషన్‌తో కలపకుంటే కాంగ్రెస్ పార్టీ సహా ఇండియా కూటమి మద్దతిస్తుందని హామీ ఇచ్చారు. కానీ కేంద్ర ప్రభుత్వం కుట్రపూరితంగా డీలిమిటేషన్‌తో కలిపి మహిళా రిజర్వేషన్ బిల్లును లోక్ సభలో ప్రవేశపెట్టిందని పొన్నం ప్రభాకర్ ధ్వజమెత్తారు.

# రేవంత్ సభను విజయవంతం చేయాలి

**మొదటిపేజీ తరువాయి** – విజయవంతం చేయాలని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పిలుపునిచ్చారు. మంథనిలోని తన క్యాంప్ కార్యాలయంలో మంథని, రామగిరి, కమాన్‌పూర్, ముత్తారం, పాలకుర్తి మండలాల కాంగ్రెస్ ముఖ్య నేతలు, ప్రజా ప్రతినిధులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. సోమవారం కాటారంలో జరగనున్న ఈ భారీ బహిరంగ సభకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేస్తారని, ఆయనతో పాటు మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు తదితరులు పాల్గొంటారని వెల్లడించారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా తమ ప్రభుత్వం పనిచేస్తోందని, దానికి రైతు భరోసా పథకమే నిదర్శనమని మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ఉమ్మడి కరీంనగర్, వరంగల్ జిల్లాల నుంచి పెద్ద ఎత్తున రైతులు తరలివచ్చేలా చూడాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. నియోజకవర్గాల వారీగా బాధ్యతలను కేటాయించిన ఆయన, ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను, పార్టీ శ్రేణులను కోరారు. కాటారం సభ ద్వారా రైతులకు భరోసా కల్పించడమే కాకుండా, వ్యవసాయ రంగానికి ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతను చాటి చెప్పబోతున్నామని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

# ఒప్పందం కుదరకుంటే మళ్లీ బాంబులే

**మొదటిపేజీ తరువాయి** – తరలించడానికి ఒప్పుకుందని ఆయన ప్రకటించారు. ఒప్పందం పూర్తయ్యే వరకు ఇరాన్‌పై నావికాదళ దిగ్బంధనం కొనసాగుతుందని ట్రంప్ తన ట్రూత్ సోషల్ ఖాతాలో పోస్ట్ చేశారు. ట్రంప్ వ్యాఖ్యలపై ఇరాన్ ఘాటుగా స్పందించింది. అమెరికా అధ్యక్షుడు చెప్పిన ఏడు విషయాలూ అబద్ధాలేనని ఇరాన్ ప్రధాన రాయబారి మొహమ్మద్ ఘాలిబాఫ్ పేర్కొన్నారు. "శుద్ధిచేసిన యురేనియం మాకు ఇరాన్ గడ్డతో సమానం. దాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ అమెరికాకు తరలించే ప్రసక్తే లేదు" అని ఇరాన్ విదేశాంగ శాఖ ప్రతినిధి స్పష్టం చేశారు. ప్రస్తుతం అమల్లో ఉన్న తాత్కాలిక కాల్పుల విరమణ మంగళవారంతో ముగియనుండగా, ట్రంప్ విధించిన బుధవారం గడువుతో ఇరు దేశాల మధ్య తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. తదుపరి చర్చలు పాకిస్థాన్‌లోని ఇస్లామాబాద్‌లో జరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

# అమెరికాకు యురేనియం ఇచ్చేది లేదు.. తేల్చి చెప్పిన ఇరాన్

**మొదటిపేజీ తరువాయి** – ఛానెల్‌లో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ఇటీవల ఇరాన్ విదేశాంగ మంత్రి చేసిన వ్యాఖ్యలపై బఘాయీ స్పష్టతనిచ్చారు. హర్మూజ్ జలసంధిలో వాణిజ్య నౌకలకు పూర్తిస్థాయిలో రాకపోకలు కొనసాగుతాయని చెప్పడం కొత్త దౌత్యపరమైన ఒప్పందంలో భాగం కాదని తెలిపారు. ఏప్రిల్ 8న అమెరికాతో కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందం మేరకే ఈ ప్రకటన చేశారని వివరించారు. ఈ ఒప్పందాన్ని లెబనాన్‌కు వర్తింపజేయడంలో అమెరికా విఫలమైందని ఇరాన్ ఆరోపించింది. హర్మూజ్ జలసంధిలో అమెరికా నావికా దళం దిగ్బంధనాన్ని కొనసాగిస్తే, తాము కూడా ప్రతిచర్యలు తీసుకుంటామని బఘాయీ హెచ్చరించారు. ఇరాన్‌పై సంయుక్త దాడుల నేపథ్యంలో ఫిబ్రవరి 28 నుంచి ఇరాన్ ఈ జలసంధిలో ఇజ్రాయెల్, అమెరికా నౌకలపై ఆంక్షలు విధించింది. దీనికి ప్రతిగా ఇరాన్ ఓడరేవులకు వచ్చే నౌకలను అమెరికా అడ్డుకుంటోంది. ప్రస్తుతం పాకిస్థాన్ మధ్యవర్తిత్వంతో చర్చలు కొనసాగుతున్నాయని, ఇరాన్ ప్రయోజనాలను కాపాడటమే లక్ష్యంగా ఈ ప్రయత్నాలు సాగుతున్నాయని బఘాయీ తెలిపారు.

# అంబటి రాంబాబు నిరాహారదీక్ష

**మొదటిపేజీ తరువాయి** – కూటమి ప్రభుత్వంపై, పోలీసు వ్యవస్థపై నిప్పులు చెరిగారు. "చంద్రబాబును దూషించాననే సాకుతో నన్ను అరెస్ట్ చేసి 18 రోజులు జైల్లో ఉంచారు.. మరి నా ఇంటిపై దాడి చేసి కార్లు, ఫర్నీచర్ ధ్వంసం చేసిన వారిని కనీసం 18 నిమిషాలైనా లోపల వేశారా?" అని ఆయన సూటిగా ప్రశ్నించారు. ఈ దాడి అంతా పోలీసుల కళ్లముందే జరిగిందని, నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఇద్దరు సీఐలను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ దాడి వెనుక నారా లోకేశ్, కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ల హస్తం ఉందని అంబటి ఆరోపించారు. గుంటూరులో ఇళ్లపై దాడులు చేసే సంస్కృతిని పెమ్మసాని తీసుకొచ్చారని విమర్శించారు. తనను అరెస్ట్ చేసిన సమయంలో నల్లపాడు పోలీస్ స్టేషన్‌లో 'కస్టోడియల్ టార్చర్'కు గురిచేసే ప్రయత్నం జరిగిందని, ఆ గాయాలు ఇంకా మానలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. "నన్ను భయపెట్టాలనుకోవడం మీ పొరపాటే.. ప్రాణాలకు తెగించైనా న్యాయపోరాటం చేస్తాను. ఎవరినీ వదిలిపెట్టను" అని హెచ్చరించారు. ఈ దీక్షకు ఎమ్మెల్సీ అప్పిరెడ్డి, వైసీపీ నేతలు నూరి ఫాతిమా, డైమండ్ బాబు తదితరులు మద్దతు తెలిపి సంఘీభావం ప్రకటించారు.

# హర్మూజ్ మళ్లీ మూసివేత ఇరాన్ సంచలన నిర్ణయం

**మొదటిపేజీ తరువాయి** – తమ ఓడరేవులకు వచ్చే నౌకలపై అమెరికా నేవీ దిగ్బంధనాన్ని కొనసాగించడమే ఈ నిర్ణయానికి కారణమని, ఇచ్చిన మాటను అమెరికా ఉల్లంఘించిందని ఇరాన్ ఆరోపించింది. "ఇరాన్ నౌకలకు స్వేచ్ఛా రవాణాను అమెరికా పునరుద్ధరించే వరకు ఈ పరిస్థితిలో మార్పు ఉండదు. హర్మూజ్ జలసంధి కఠినంగా నియంత్రించబడుతుంది'' అని ఇరాన్ సైనిక కమాండ్ తమ అధికారిక టెలివిజన్‌లో స్పష్టం చేసింది. ఇజ్రాయెల్-లెబనాన్ కాల్పుల విరమణ ఒప్పందం తర్వాత, కేవలం రెండు రోజుల క్రితమే ఇరాన్ ఈ జలసంధిని తెరిచింది. అయితే, ఇరాన్‌తో విస్తృత ఒప్పందం కుదిరే వరకు నేవీ దిగ్బంధనం కొనసాగుతుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పష్టం చేయడంతో పరిస్థితి మళ్లీ మొదటికొచ్చింది. పర్షియన్ గల్ఫ్ నుంచి ఆయిల్ ఎగుమతులకు హర్మూజ్ జలసంధి ప్రధాన మార్గం. ప్రపంచ ఆయిల్ రవాణాలో దాదాపు 20 శాతం ఇక్కడి నుంచే జరుగుతుంది. ఇరాన్ తాజా నిర్ణయంతో మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు మళ్లీ పెరిగే అవకాశం ఉందని, ఇది ప్రపంచ ఆయిల్ ధరలపై ప్రభావం చూపే ప్రమాదం ఉందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# ఓటర్ల జాబితా వివాదం: సోనియా గాంధీపై కేసు.. నేడు ఢిల్లీ కోర్టులో విచారణ



**మొదటిపేజీ తరువాయి** – సోనియా గాంధీపై దాఖలైన క్రిమినల్ రివిజన్ పిటిషన్‌పై ఢిల్లీ కోర్టు శనివారం విచారణ చేపట్టనుంది. ఈ కేసులో ఇప్పటికే పిటిషనర్ తరఫు వాదనలు ముగియగా, సోనియా గాంధీ తరఫు న్యాయవాది వాదనలు ఇంకా పూర్తి కాలేదు. రౌస్ అవెన్యూ కోర్టులో ఈ కేసుపై మార్చి 30న పాక్షికంగా విచారణ జరిపిన న్యాయస్థానం, తదుపరి విచారణను ఏప్రిల్ 18కి వాయిదా వేసింది. భారత పౌరసత్వం లేని సమయంలో సోనియా గాంధీ పేరు ఓటర్ల జాబితాలో ఎలా చేరిందనే దానిపై ఎఫ్ఐఆర్ నమోదు చేసి, విచారణ జరపాలని కోరుతూ న్యాయవాది వికాస్ త్రిపాఠి ఈ రివిజన్ పిటిషన్ దాఖలు చేశారు. విదేశీ పౌరురాలి పేరును ఫోర్జరీ పత్రాలు లేదా మోసపూరిత మార్గాల ద్వారానే ఓటర్ల జాబితాలో చేర్చి ఉంటారని పిటిషనర్ తన వాదనలు వినిపించారు. ఇందుకు ఆధారంగా ఎలక్టోరల్ రోల్స్ సర్టిఫైడ్ కాపీలను కోర్టుకు సమర్పించినట్లు తెలిపారు. అయితే, ఈ ఆరోపణలను సోనియా గాంధీ కొట్టిపారేశారు. ఇవి పూర్తిగా రాజకీయ ప్రేరేపితమని, నిరాధారమైనవని తన సమాధానంలో పేర్కొన్నారు. పౌరసత్వానికి సంబంధించిన అంశాలు కేంద్ర ప్రభుత్వ పరిధిలోకి, ఎన్నికల జాబితా వివాదాలు ఎన్నికల సంఘం పరిధిలోకి వస్తాయని ఆమె స్పష్టం చేశారు. ఫోర్జరీకి సంబంధించి ఎలాంటి విశ్వసనీయమైన ఆధారాలు సమర్పించలేదని, ఇది న్యాయ ప్రక్రియను దుర్వినియోగం చేయడమేనని వివరించారు. గతంలో మేజిస్ట్రేట్ కోర్టు ఈ ఫిర్యాదును కొట్టివేయగా, పిటిషనర్ రౌస్ అవెన్యూ కోర్టులో రివిజన్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను విచారణకు స్వీకరించిన కోర్టు, డిసెంబర్ 9, 2025న సోనియా గాంధీకి, ఢిల్లీ పోలీసులకు నోటీసులు జారీ చేసింది.

# ఉచిత వైద్య శిబిరాన్ని- రక్తదాన శిబిరాన్ని జయప్రదం చేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు

మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ కే. రవికాంత్ వెల్లడి...

**హంస కలం వార్త, తెలుగు దినపత్రిక ఏప్రిల్ 19-26:** నిజామాబాద్ జిల్లా బాల్కొండ నియోజకవర్గం మండల కేంద్రమైన మోర్తాడ్ గ్రామంలో గల మండల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఆదివారం రోజున ప్రైమ్ ఆశ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి యాజమాన్యం, ఆశ సూపర్ స్పెషాలిటీ వైద్యులు, సిబ్బంది ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా ఉచిత వైద్య శిబిరం, రక్తదాన శిబిరం అత్యంత విజయవంతమైంది అని ఆశా సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ కే.రవి కాంత్ వెల్లడించారు. మోర్తాల్లో ఆశా ప్రభుత్వ ఆసుపత్రి వారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం, రక్తదాన శిబిరం ఈ కార్యక్రమం దిగ్విజయం కావడానికి సహకరించిన,ప్రతి ఒక్కరికీ పేరుపేరునా



ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఉచిత మేఘ వైద్య శిబిరానికి, రక్తదాన శిబిరానికి సహకరించిన స్థానిక గ్రామ సర్పంచ్ భోగ ఆనంద్, ఉప సర్పంచ్ సామ శ్రీనివాస్, వార్డు సభ్యులు, గ్రామ అభివృద్ధికమిటీ సభ్యులు, అధ్యక్షులు ఎలాల రమేశ్ రెడ్డి, ఉపాధ్యక్షులు దోన్పాల్ ప్రవీణ్ కు, వై. శ్రీ.కి, బద్దం రవికి, యువతకు కే. రవి కాంత్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ముఖ్యంగా ఈ శిబిరంలో ఎంతో ఉత్సాహంగా పాల్గొని, ప్రాణదాతలుగా నిలిచిన, రక్తదాతలైన యువతకు, ఆస్పత్రి తరఫున హృదయపూర్వక అభినందనలు తెలిపారు.మీ చొరవ మరెందరికో స్ఫూర్తిదాయకం. గ్రామ ప్రజానీకానికి, సహకరించిన ప్రతి ఒక్కరికీ కే. రవి కాంత్ మరోసారి ధన్యవాదాలు తెలియజేశారు.

# బిల్లుకు కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకం అంటూ బీజేపీ దుష్ప్రచారం చేస్తోంది.. దీనిని తీవ్రంగా ఖండిస్తున్నాం

టీజీఐఐసి చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి

**సంగారెడ్డి హంస కలం వార్త, తెలుగు దినపత్రిక ఏప్రిల్ 19-26:** సంగారెడ్డి లో డీలిమిటేషన్ తో కలిపి మహిళా బిల్లును ప్రవేశపెట్టడంలోనే బీజేపీ చేస్తున్న కుట్ర దాగి వుంది కాంగ్రెస్ పార్టీ తొలి నుంచి మహిళల సాధికారతకు కట్టుబడి వుంది వచ్చే సమావేశంలో మహిళా బిల్లును సెపరేట్ గా ప్రవేశ పెట్టాలని డిమాండ్ చేస్తున్నాం సంగారెడ్డిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో టీజీఐఐసీ చైర్ పర్సన్ నిర్మల జగ్గారెడ్డి మహిళా బిల్లుకు కాంగ్రెస్ వ్యతిరేకం అని బీజేపీ దుష్ప్రచారం చేస్తోంది గతంలోనే మహిళా బిల్లు ఆమోదం పొందేలా చేసింది కాంగ్రెస్ పార్టీ కేవలం బీజేపీ వాళ్లు దీనిని ఒక ఆయుధంగా మార్చుకోవాలని కుట్ర చేశారు ఆడజాలాక పాత గజ్జెలు అన్నట్లుగా ఉంది బిజెపి నాయకుల ధోరణి డీలిమిటేషన్ లో మహిళా బిల్లును కలపడమే ఇందుకు నిదర్శనంబీజేపీలో ఒక్కరినైనా ప్రధాని స్థాయికి తెచ్చారా? కాంగ్రెస్ పార్టీలో ఇందిరా గాంధీ ప్రధాని పదవిని చేపట్టారు. కాంగ్రెస్ పార్టీ అన్ని విషయాల్లో మహిళలకు పెద్దపీట వేస్తూ వస్తోంది మీకు దమ్ము, దైర్యం ఉంటే పార్లమెంట్ లో మహిళా బిల్లును సెపరేట్ గా ప్రవేశ పెట్టండి.. కాంగ్రెస్ తప్పకుండా మద్దతునిస్తుంది అందుకు విరుద్ధంగా కేవలం తమ స్వార్ధ రాజకీయ ప్రయోజనాల కోసం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం.. డీ లిమిటేషన్, మహిళా బిల్లులను వాడుకుంటోంది కాంగ్రెస్ పార్టీ తొలి నుంచి మహిళలకు సరైన ప్రాధాన్యత ఇస్తోంది. దక్షిణాది రాష్ట్రాలకు రాజకీయ ప్రాధాన్యం తగ్గించేలా, ఉత్తరాది రాష్ట్రాలకు లాభం చేయడానికి...బీజేపీ డి లిమిటేషన్



బిల్లు పేరిట కేవలం ఓట్ల రాజకీయం చేస్తోంది. పైగా మహిళా బిల్లుకు కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకం అంటూ బురద జల్లే ప్రయత్నం చేస్తోంది. తెలంగాణలో మహిళలను కోటీశ్వరులను చేసేలా సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రజా పాలన సాగుతోంది వచ్చే సమావేశాల్లో మహిళా బిల్లును సెపరేట్ గా ప్రవేశ పెట్టాలి. లేని పక్షంలో మహిళల హక్కులను సాధించుకునేలా పోరాటం చేస్తాం అన్నారు విలేకరుల సమావేశంలో సదాశివ పేట మున్సిపల్ ఛైర్ పర్సన్ మునిపల్లి అంజమ్మ, సంగారెడ్డి మున్సిపల్ ఛైర్ పర్సన్ కూన వనిత, సదాశివపేట వైస్ ఛైర్ పర్సన్ హెచ్.రేణుక చిరు , సీడీసీ చైర్మన్ రామ్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మునిపల్లి సత్యనారాయణ, కూన సంతోష్, కిరణ్ గౌడ్, చిరు, సిద్దన్న, మోతీ లాల్ నాయక్, బుచ్చి రాములు తదితరులు పాల్గొన్నారు

# భూమి మీద నేరుగా 70% అతి నీలా లోహిత సూర్య కిరణలు ప్రస్తావిస్తాయి

సంగారెడ్డి **హంస కలం వార్త, తెలుగు దినపత్రిక ఏప్రిల్ 19-26:** ఏప్రిల్ 19 నుండి మే 31 వరకు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఎవరూ బయటకు (ప్రత్యేకంగా బహిరంగ ప్రదేశాలకు) వెళ్లకూడదు. ఎందుకంటే ఉష్ణోగ్రత 45లీజ నుండి 55లీజ వరకు పెరగవచ్చని వాతావరణ శాఖ తెలిపింది. ఈ సమయంలో భూమి మీద నేరుగా 70% అతినీలలోహిత సూర్య కిరణాలు ప్రసరిస్తాయి. ఎవరికైనా శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది లేదా అకస్మాత్తుగా అస్వస్థత కలిగితే వెంటనే డాక్టర్‌ను సంప్రదించండి. గాలి సరిగా వచ్చేలా గదుల తలుపులు తెరిచి ఉంచండి. మొబైల్ వినియోగాన్ని తగ్గించండి, అధిక వేడి కారణంగా మొబైల్ పేలే ప్రమాదం ఉంది. జాగ్రత్తగా ఉండండి మరియు ఈ సమాచారాన్ని ఇతరులకు తెలియజేయండి. పెరుగు, మజ్జిగ, నిమ్మ పండు రసం వంటి చల్లని పానీయాలను ఎక్కువగా తీసుకోండి.చాలా ముఖ్యమైన సమాచారంపౌర రక్షణ విభాగం ప్రజలు మరియు నివాసితులకు క్రింది సూచనలు చేస్తోంది. రాబోయే రోజుల్లో ఉష్ణోగ్రతలు 47లీజ నుండి 55లీజ వరకు పెరుగుతాయి. కొన్ని ప్రాంతాల్లో శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది కలిగించే వేడి గాలులు ఉండే అవకాశం ఉంది.కాబట్టి ఈ జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించండి కార్లలో ఉంచకూడని వస్తువులు గ్యాస్ పదార్థాలు లైటర్లు కార్బోనేటెడ్ పానీయాలు సుగంధ ద్రవ్యాలు మరియు బ్యాటరీలుగాలి ప్రసరణ కోసం కారు కిటికీలు కొద్దిగా తెరిచి ఉంచండి కారు ఇంధన ట్యాంక్‌ను పూర్తిగా నింపకండి సాయంత్రం సమయంలో మాత్రమే కారులో ఇంధనం నింపండి ఉదయం ఈ సమయంలో కారులో ప్రయాణం చేయడం నివారించండి ప్రయాణ సమయంలో టైర్లలో అధిక గాలి నింపకండి ఇతర జాగ్రత్తలు తేళ్లు మరియు పాములు చల్లని ప్రదేశాల కోసం ఇళ్లలోకి రావచ్చు, కాబట్టి జాగ్రత్తగా ఉండండిఎక్కువగా నీరు మరియు ద్రవాలు తాగండి గ్యాస్ సిలిండర్‌ను ఎండలో ఉంచవద్దు విద్యుత్ మీటర్లపై అధిక లోడ్ వేయవద్దు అవసరమైన గదుల్లో మాత్రమే ఎయిర్ కండిషనర్ ఉపయోగించండి ప్రతి 2--3 గంటలకు కనీసం 30 నిమిషాలు విశ్రాంతి తీసుకోండి బయట ఉష్ణోగ్రత 45--47లీజ ఉన్నప్పుడు, ఇంట్లో ాజని 24--25లీజ వద్ద ఉంచండి ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నేరుగా సూర్యకాంతిని తప్పించండి చివరిగా ఈ సమాచారాన్ని తప్పనిసరిగా ఇతరులతో పంచుకోండి. చాలా మందికి ఇది తెలియకపోవచ్చు. మీరు మొదటిసారి చదువుతున్నవారిలో ఒకరై ఉండవచ్చు.

# ఉత్తమ ర్యాంకులు సాధించడం స్కాలర్స్ కళాశాల సొంతం

డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి

రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు

వనపర్తి బ్యూరో**హంస కలం వార్త, తెలుగు దినపత్రిక ఏప్రిల్ 19-26:**ఇటీవల తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ఇంటర్మీడియట్ ఫలితాలలో వనపర్తి పట్టణంలో గల స్కాలర్స్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించిన విషయం తెలుసుకున్న రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి విద్యార్థులకు శాలువతో సన్మానించారు.ఈ సందర్బంగా చిన్నా రెడ్డి మాట్లాడుతూ స్కాలర్స్ కళాశాలకు ప్రభుత్వం నుంచి అన్ని అనుమతులు నేను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో 1991 ఇప్పించానని అన్నారు. కళాశాల యజమాన్యం డాక్టర్ జగదీశ్వర్, డాక్టర్ వరప్రసాద్, డాక్టర్ నాగేశ్వర్ రెడ్డి, డాక్టర్ సత్యనారాయణ రెడ్డి తమ తమ సబ్జెక్టుల నైపుణ్యాలతో విద్యార్థులను ఉన్నతంగా




తీర్చిదిద్దుతున్నారని అన్నారు. ఇంటర్ ఫలితాల్లో ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను మీరే భవిష్యత్ భారత నిర్మాతలు కాబట్టి లక్ష్యాలను ఉన్నతంగా పెట్టుకొని ఉన్నతంగా ఎదిగి పుట్టిన ప్రాంతానికి సేవ చేయాలని కోరారు. ఉన్నతంగా ఎదిగిన మీరు కష్టపడి చదివించిన మీ తల్లిదండ్రులను మరవకుండా , మీకు ఉన్నత విద్యను బోధించిన ఉపాధ్యాయులను మరువకూడదు అని అన్నారు.నీట్, ఐఐటీ, జేఈఈ, ఎన్ఐటీ, ఫలితాలలో కూడా ఉత్తమ ర్యాంకులు సాధించి స్కాలర్స్ కళాశాలకువనపర్తి జిల్లా కు మంచి పేరు తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు. ద్వితీయ సంవత్సరం బైపిసి మహాలక్ష్మి 993, ప్రథమ సంవత్సరం బైపిసి పల్లవి 437, నిమ్ర అఫ్సన్ 437, ద్వితీయ సంవత్సరం ఎంపీసీ నర్మద 992 ప్రథమ సంవత్సరం ఎంపీసీ బన్నీ 463 మార్కులు సాధించిన విద్యార్థులను చిన్నారెడ్డి శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి ప్రధాన కార్యదర్శి నందిమల్ల యాదయ్య, వనపర్తి పట్టణ ప్రధాన కార్యదర్శి బాబా, సీనియర్ నాయకులు నందిమల్ల రామ్, మణిగిల్ల బాల్ రాజు, సిరివాటి సురేష్, యుగంధర్ రెడ్డి, రామ్ సింగ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# జాగృతి కళాశాల విద్యార్థులను సన్మానించిన ఎక్సైజ్, పర్యాటక - సాంస్కృతిక శాఖ మంత్రి జుపల్లి కృష్ణారావు

వనపర్తి బ్యూరో **హంస కలం వార్త, తెలుగు దినపత్రిక ఏప్రిల్ 19-26:** రాష్ట్ర స్థాయి 2వ ర్యాంకు ఉమ్మడిజిల్లా 1వ ర్యాంకును సాధించిన జాగృతి విద్యార్థులను ఘనంగా




సన్మానించిన ఎక్సైజ్, పర్యాటక - సాంస్కృతిక శాఖ మంత్రి జుపల్లి కృష్ణారావు ఐపిఈ 2026 ప్రథమ, ద్వితీయ సంవత్సరం ఫలితాలలో పట్టణంలోని జాగృతి కళాశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో × బైపిసి లో ఉజ్మా హజారా 438 /440 మార్కులతో 2వ ర్యాంకును, అదే విధంగా ×× బైపిసి లో హెచ్. అనుష్ఠ 994/1000 మార్కులతో ఉమ్మడిజిల్లా మొదటి ర్యాంకును సాధించి మరొకసారి వనపర్తిలో ప్రతిభ చాటారు. ఈ విషయాన్ని తెలుసుకున్న ఎక్సైజ్, పర్యాటక - సాంస్కృతిక శాఖ మంత్రి జుపల్లి కృష్ణారావు అదివారం జాగృతి కళాశాలకు వచ్చి స్టేట్ ర్యాంకర్లను ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ సాధారణ విద్యార్థులతో కార్పొరేట్ స్థాయి మార్కులతో, స్టేట్ ర్యాంకులను, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ఫస్ట్ ర్యాంకులను సాధిస్తూ ఉమ్మడి జిల్లాలో అద్భుతమైన ఫలితాలు సాధిస్తున్నందుకు జాగృతి కళాశాల విద్యార్థులను అభినందించారు. జేఈఈ మెయిన్ -2026 సెక్షన్-× ఫలితాలలో సిహెచ్.అర్జున్ 91.69 పర్సంటైల్ తో 5 అగ్రగామిగా నిలవడం జరిగింది అని కొనియాడారు. జిల్లాలో ఇంటర్ విద్యలో ఐపిఈ మార్కులతో పాటు జేఈఈ నీట్ , ఎంసెట్ లలో కూడా కార్పొరేట్ కళాశాలలకు దీటుగా జాగృతి కళాశాల నిలవడం ఎంతో సంతోషంగా ఉంది అని జాగృతి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ అంబటి వినోద్ కుమార్ ని యజమాన్య సభ్యులు భాస్కర్ , శ్యామ్ కుమార్ సత్యనారాయణ ను ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత స్థానంలో నిలవడానికి స్పష్టమైన లక్ష్యాన్ని ఎంచుకుని, క్రమశిక్షణతో కష్టపడి కాకుండా ఇష్టపడి చదవడం చాలా ముఖ్యం. సాంకేతికతను (మొబైల్స్) పరిమితంగా వాడుతూ, వ్యక్తిత్వ వికాసంపై దృష్టి సారించి తల్లిదండ్రులకు, కళాశాలకు గుర్తింపు తీసుకురావాలి. శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకుని నిరంతరం అభ్యసించడం ద్వారా భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు ఎదగవచ్చు. స్పష్టమైన, సాధించగల లక్ష్యాలను ముందుగానే ఎంచుకోవాలి. ఇష్టపడి చదవడం ద్వారా మాత్రమే ఉన్నత స్థానాల్లో స్థిరపడగలరు. సోషల్ మీడియా, మొబైల్ ఫోన్లకు దూరంగా ఉంటూ చదువుపై ఏకాగ్రత పెట్టాలి. చదువుతో పాటు వ్యక్తిత్వ వికాసాన్ని పెంచుకోవాలి. నిరంతరం నేర్చుకునే తత్వం కలిగి ఉండాలి. చదువుతో పాటు ఆరోగ్య నియమాలు పాటిస్తూ, క్రమశిక్షణతో ఉండాలి అని విద్యార్థులకు సూచించారు . అనంతరం కళాశాల రికార్డులను పరిశీలించి యాజమాన్యాన్ని శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో కొల్లాపూర్ మున్సిపల్ వైస్ చైర్మెన్ రహీం పాషా, పర్యాటక శాఖ అధికారి కల్వరాల నరసింహ, తదితర నాయకులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి



కమ్మర్పల్లి మండల **హంస కలం వార్త, తెలుగు దినపత్రిక ఏప్రిల్ 19-26:** మార్కెట్ కమిటీ పాలకవర్గ సభ్యులు, మండల కాంగ్రెస్ నాయకులు వెల్లడి.. రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించి, రైతుల వద్దకే కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు వచ్చి ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నారని, రైతులు ఇట్టి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమ్మర్పల్లి మండల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పాలెపు నర్సయ్య, వైస్ చైర్మన్ బుచ్చి మల్లయ్య, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సుంకేట్ రవి, మార్కెట్ కమిటీ పాలకవర్గ సభ్యులు, మండల కాంగ్రెస్ నాయకులు కోరారు. శనివారం రోజున నిజామాబాద్ జిల్లా బాల్కొండ నియోజకవర్గం మండల కేంద్రమైన కమ్మర్ పల్లి గ్రామంలో రైతుల సౌకర్యార్థం ప్రభుత్వం వరి కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసిందని, రైతులు పండించిన ధాన్యాన్ని దళారులకు విక్రయించి మోసపోకుండా ఉండేందుకై కొనుగోలు కేంద్రాలను ముందస్తుగానే ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ముందుగా వరి కొనుగోలు కేంద్రాన్ని కమ్మర్పల్లి మండల వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గ సభ్యులు, మండల కాంగ్రెస్ నాయకులు, వివిధ శాఖల అధికారులు పూజా కార్యక్రమాలు నిర్వహించి వారి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. వరి కొనుగోలు కేంద్రాల్లో ఎలాంటి సమస్యలు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పించడం జరిగిందని వారు పేర్కొన్నారు.

# గ్రామ గ్రామాన ఉచిత వైద్య శిబిరాలను నిర్వహిస్తాం

ఆశ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి యాజమాన్యం, వైద్యుల వెల్లడి...







కమ్మర్పల్లి మండల **హంస కలం వార్త, తెలుగు దినపత్రిక ఏప్రిల్ 19-26:** నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ మున్సిపల్ పరిధి ఆర్మూర్- పెర్కిట్ గ్రామాల జాతీయ రహదారి ప్రక్కనే ఏర్పాటుచేసిన ఆశ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి యాజమాన్యం, వైద్యుల ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంతాల ప్రజలకు సేవ చేయాలని సంకల్పంతో గ్రామ గ్రామాన ఆర్మూర్ ఆశ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత మేఘ వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి తమ వంతు సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని తెలిపారు. నిజామాబాద్ జిల్లా బాల్కొండ నియోజకవర్గం మండల కేంద్రమైన మోర్తాడ్ ప్రభుత్వ ఆసుపత్రిలో ఆదివారం రోజున ఆశ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి వారి ఆధ్వర్యంలో ఉచిత మెగా శిబిరం, రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో ఆశ ఆస్పత్రి వారి వైద్యులు ఉచిత వైద్య శిబిరంలో అన్ని రోగుల వారికి ఉచిత చెకప్ లు, చికిత్సలు నిర్వహించి, రోగులకు కావలసిన మందులను సైతం ఉచితంగానే అందజేశారు. ఉచిత వైద్య శిబిరంలో వైద్యులు అన్ని రకాల రోగులకు చికిత్సలు నిర్వహించి, ఉచితంగా మందులు అందించడం పట్ల రోగులు, గ్రామ ప్రజలు, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, ప్రజా ప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు ఆర్మూర్ ఆశ సూపర్ స్పెషాలిటీఆస్పత్రి యాజమాన్యానికి, వైద్యులకు, సిబ్బందికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఉచిత వైద్య శిబిరం అనంతరం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఉచిత వైద్య శిబిరం, రక్తదాన శిబిరం విజయవంతం కావడం పట్ల ఆస్పత్రి వైద్యులు రోగుల నుండి స్పందన రావడం, గ్రామస్తుల సహకారం వల్ల, మరింత గ్రామాలలో ఉచిత మేఘ వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

# ఆందోల్ జోగిపేట లో 20 కోట్లతో ఇంటిగ్రేటెడ్ ఆఫీస్ కాంప్లెక్స్ నిర్మాణానికి శంకుస్థాపన చేసిన

మంత్రి దామోదర్ రాజనర్సింహ.

సంగారెడ్డి **హంస కలం వార్త, తెలుగు దినపత్రిక ఏప్రిల్ 19-26:** రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆందోల్ - జోగిపేట మున్సిపాలిటీ పరిధిలో 20 కోట్ల రూపాయలతో నూతనంగా నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ ఆఫీస్ కాంప్లెక్స్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో



జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య, మున్సిపల్ చైర్మన్ కృష్ణారెడ్డి, ఏఎంసీ చైర్మన్ రామ్ రెడ్డి, మార్క్ఫెడ్ డైరెక్టర్ జగన్మోహన్ రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు సురేందర్ గౌడ్, మున్సిపల్ వైస్ చైర్మన్ చిట్టిబాబు, కౌన్సిలర్ మర్రి అరుణ కుమారి, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న ఎమ్మెల్యే చింత ప్రభాకర్







సదాశివపేట **హంస కలం వార్త, తెలుగు దినపత్రిక ఏప్రిల్ 19-26:** స్నేహానికన్న మిన్న లోకాన లేదురా అని ఎమ్మెల్యేచింత ప్రభాకర్ ఆదివారం నాడు ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్ లో నిర్వహించిన1982 ఎస్ఎస్సి బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు ఇట్టి కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథులు గా హాజరై మాట్లాడారు. ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం ద్వారా స్నేహితులందరూ ఒక్కచోట కలుసుకోవడం సంతోషకరమని. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించడం అభినందనీయమన్నారు. మీతో పాటు చదివిన విద్యార్థులందరూ వివిధరంగాలలో స్థిరపడి ఒక్క చోట కలుసుకోవడం స్నేహానికిఉన్న విలువని. రక్తసంబంధం కన్నా స్నేహితుడే గొప్ప అని కొని ఆడారు. అంతరం చదువులు నేర్పిన గురువులకు శాలువా పూలదండలతో సత్కరించి గురువుల ఆశీర్వాదం పొందారు. ఈ సమ్మేళన కార్యక్రమం విజయవంతం కావడానికి కృషి చేసిన మిత్రులు రమేష్. చింతగోపాల్. అశోక్ కుమార్. శ్రీనివాస్. అమ్రాది మల్లికార్జున్. కరుణాకర్ .లింగం. మేడం కృష్ణ. పద్మలత. గీత. మిత్రబృందం తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి కళ్యాణ మహోత్సవానికి రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు పులిమామిడి రాజును ఆహ్వానం

గొల్లకురుమ యాదవ సంఘం సభ్యులు



సంగారెడ్డి **హంస కలం వార్త, తెలుగు దినపత్రిక ఏప్రిల్ 19-26:** 26 సంగారెడ్డి జిల్లా తాళ్లపల్లి గ్రామంలో తేది:26-04-2026 ఆదివారం రోజున నిర్వహించే శ్రీ శ్రీ శ్రీ భ్రమరాంబ మల్లికార్జునస్వామి కళ్యాణ మహోత్సవ ఆహ్వాన కరపత్రికను రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు పులిమామిడి రాజుకు ఆలయ కమిటీ సభ్యులు అందజేసి ఆహ్వానించడం జరిగింది. ఈ సందర్భంగా మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు నిర్వాహకులు పులిమామిడి రాజుకు తెలిజేశారు. ఇట్టి దైవకార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని పులిమామిడి రాజును ఆలయ కమిటీ సభ్యులు కోరడం జరిగింది. ఇట్టి సందర్భంగా పులిమామిడి రాజు మాట్లాడుతూ ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో ఐక్యతను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. అదేవిధంగా ఈ మహోత్సవ కార్యక్రమం విజయవంతం కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటి సభ్యులు ఎం. ప్రమోద్, వీరన్న, శ్రీనివాస్, రాజ్ కుమార్, హర్షవర్ధన్, శ్రీశైలం, శ్రీకాంత్, రాజు, సత్యనారాయణ మొదలగు వారు పాల్గొన్నారు.

# పాత సిద్ధాంతాలు చచ్చాయి.. వాటినే పట్టుకుంటే అంతమే: ఆర్జీవీ



దర్శకుడు రామ్ గోపాల్ వర్మ శైలి ఎప్పుడూ భిన్నంగానే ఉంటుంది. అయితే తాజాగా -దురంధర్ 2- చిత్రం చూసిన తర్వాత ఆయనలో కనిపిస్తున్న మార్పు టాలీవుడ్‌లోనే కాకుండా బాలీవుడ్‌లో కూడా సంచలనం సృష్టిస్తోంది. ఈ సినిమా చూసిన తర్వాత ఒక దర్శకుడిగా తాను మళ్ళీ పుట్టాలని కోరుకుంటున్నట్లు వర్మ ప్రకటించడం ఆయనలోని పరివర్తనకు అద్దం పడుతోంది. పాత సినిమా సిద్ధాంతాలన్నీ 19 మార్చి 2026తో అంతమయ్యాయని.. వాటినే ఇంకా పట్టుకుంటే ఎవరైనా నాశనం అవ్వక తప్పదని ఆయన కుండబద్దలు కొట్టినట్లు చెప్పారు. బ్యాండ్ మేళం రిజల్ట్.. కోన వెంకట్ ఏమంటారో మరి? దురంధర్- ఫ్రాంఛైజీ ఇచ్చిన స్ఫూర్తితో వర్మ తన తదుపరి చిత్రం -సిండికేట్-ను ప్రకటించారు. ఈ సినిమాను తన -గురువు-గా భావిస్తున్న ఆదిత్య ధర్‌కు అంకితం ఇచ్చారు. చనిపోయిన తనలోని దర్శకుడిని ఆదిత్య ధర్ మళ్ళీ బతికించాడని వర్మ భావిస్తున్నారు. అందుకే ఆదిత్య ధర్ స్కూల్ ఆఫ్ ఫిల్మ్ మేకింగ్‌ను ఫాలో అవ్వడం ద్వారానే అప్‌డేటెడ్‌గా ఉండగలమని ఆయన తోటి దర్శకులకు, రచయితలకు సూచించారు. అహాన్ని పక్కన పెట్టి ఈ కొత్త తరహా మేకింగ్‌పై పరిశోధన చేయాలని ఆయన కోరారు. కియరా లుక్‌కి అనన్య అసూయ చూసారా! వర్మ కొత్త సినిమా -సిండికేట్- కథాంశం కూడా చాలా ఆసక్తికరంగా ఉండబోతోంది. ఇది భారతదేశ ఉనికికే ముప్పు తెచ్చే ఒక అత్యంత శక్తివంతమైన , క్రూరమైన సంస్థ గురించి సాగే కథ. ఇందులో ఎలాంటి దెయ్యాలు లేదా అతీంద్రియ శక్తులు ఉండవు. కానీ మనుషుల మెదడులో ఉండే భయంకరమైన ఆలోచనలు, వారు చేసే ఘోరాలు చూస్తే ఇది ఒక హారర్ సినిమా చూసిన అనుభూతిని కలిగిస్తుందని వర్మ వివరించారు. -దురంధర్ 2- తర్వాత మొదలైన కొత్త సినిమా యుగానికి ఈ చిత్రం సరైన ఆరంభం అవుతుందని ఆయన నమ్ముతున్నారు. ూశ్రీంశీ =ఖుం - నెగెటివ్ మనుషులకు దూరంగా ఉండండి: చిరంజీవి ఇంతకాలం తన సినిమాలకు హాలీవుడ్ క్లాసిక్ చిత్రాలే బెంచ్‌మార్క్ అని వర్మ నిజాయితీగా అంగీకరించారు. -రంగీలా-కు ది సౌండ్ ఆఫ్ మ్యూజిక్, -రాత్-కు ఎక్సార్సిస్ట్, -సత్య-, -సర్కార్- వంటి చిత్రాలకు గాడ్‌ఫాదర్ స్ఫూర్తి అని ఆయన వెల్లడించారు. కానీ ఇప్పుడు -దురంధర్ 2- చూశాక తన పాత సినిమాలన్నీ ఏమాత్రం పనికిరానివిగా అనిపిస్తున్నాయని వర్మ వ్యాఖ్యానించారు. ఈ చిత్రం మేకింగ్, క్రాఫ్ట్, స్టోరీ టెల్లింగ్‌లో గాడ్‌ఫాదర్‌కే -గాడ్‌ఫాదర్- లాంటిదని ఆయన ఆకాశానికెత్తేశారు. పాపం ప్రతాప్ కాదు.. పాపం తిరువీర్ మొత్తానికి ఆదిత్య ధర్‌తో ఏర్పడిన ఆన్‌లైన్ స్నేహం వర్మను ఒక -మారిన మనిషి-గా మార్చేసింది. గతేడాది డిసెంబర్ నుంచి వీరిద్దరి మధ్య మొదలైన ఈ అనుబంధం ఇప్పుడు కొత్త తరహా సినిమాలకు బాటలు వేస్తోంది. ఇప్పటివరకు తాను నమ్మిన పాత సూత్రాలన్నింటినీ పక్కన పెట్టేసి, ఆధునిక మేకింగ్ శైలికి అనుగుణంగా తనను తాను మార్చుకోవాలని వర్మ తీసుకున్న నిర్ణయం ఆయనలోని కొత్త తపనను చాటిచెబుతోంది. ఈ క్రమంలో -సిండికేట్- సినిమాతో వర్మ మళ్ళీ తన పూర్వవైభవాన్ని అందుకుంటారో లేదో చూడాలి.



# నెగెటివ్ మనుషులకు దూరంగా ఉండండి: చిరంజీవి



ఏదైనా విషయాన్ని పాజిటివ్ గా చూడటం లేదా నెగెటివ్ గా చూడటం.. ఈ రెండిటి మధ్యా సన్నని లైన్ అడ్డు ఉంటుంది. పాజిటివిటీ ఉన్న చోట ప్రతిదీ సక్సెస్ గా మారుతుంది. అందుకే చాలా మంది నెగెటివిటీని దరి చేరనివ్వరు. ఈ జాబితాలో మెగాస్టార్ చిరంజీవి కూడా ఉన్నారు. మెగాస్టార్ తన జీవితానుభవాల నుండి నెగెటివిటీ పాజిటివిటీ గురించి అందించిన ఈ విలువైన సందేశం అందరినీ ఆకట్టుకుంటోంది. జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలనుకునే ప్రతి ఒక్కరికీ సానుకూల దృక్పథం చాలా అవసరమని మెగాస్టార్ చిరంజీవి ఓ సందర్భంలో పేర్కొన్నారు. ముఖ్యంగా కెరీర్ ప్రారంభ దశలో ఉన్నప్పుడు మన చుట్టూ ఉండేవారు మనల్ని ప్రోత్సహించేలా ఉండాలే తప్ప నిరుత్సాహపరిచేలా ఉండకూడదని ఆయన సూచించారు. మద్రాసు - పాండి బజార్ లో తాను ఎదుర్కొన్న ఒక చేదు అనుభవాన్ని ఉదాహరణగా చూపుతూ.. నెగటివ్ ఆలోచనలు ఉన్న వ్యక్తుల వల్ల మనలోని ఆత్మవిశ్వాసం ఏ విధంగా దెబ్బతింటుందో వివరించారు. పాత సిద్ధాంతాలు చచ్చాయి.. వాటినే పట్టుకుంటే అంతమే: ఆర్జీవీ 1977లో సినిమాల్లో అవకాశాల కోసం ప్రయత్నిస్తున్న రోజుల్లో మద్రాసులోని పాండీ బజార్‌లో జరిగిన సంఘటనను ఆయన గుర్తు చేసుకున్నారు. అక్కడ కొందరు వ్యక్తులు తన రూపాన్ని, ముక్కును చూసి --వీడు హీరో అయిపోతాడంట.. వీడి మొహం చూడు-- అని వెటకారంగా మాట్లాడటం తనను ఎంతో కలిచివేసిందని చెప్పారు. ఉత్సాహంగా వెళ్లిన తాను ఆ నెగటివ్ మాటల వల్ల తీవ్రమైన నిరాశకు లోనై ఎంతో డల్ అయిపోయి రూమ్ కి తిరిగి వచ్చానని ఆవేదన వ్యక్తం చేశారు. మనం ఎదిగే క్రమంలో చాలా సున్నితంగా మానసిక సంఘర్షణతో ఉంటామని.. అటువంటి సమయంలో ఎప్పుడూ పాజిటివ్ వాతావరణంలోనే ఉండాలని చిరంజీవి హితవు పలికారు. ఫ్రస్ట్రేషన్‌లో ఉండే నెగటివ్ వ్యక్తుల దగ్గరకు వెళ్తే మనలోని శక్తి సన్నగిల్లుతుందని ఆయన హెచ్చరించారు. అందుకే ఆ రోజు ఆ సంఘటన తర్వాత తాను మళ్ళీ ఎప్పుడూ పాండీ బజార్ వైపు వెళ్లలేదని.. తన చుట్టూ ఎప్పుడూ సానుకూలత ఉండేలా జాగ్రత్త పడ్డానని తెలిపారు. బ్యాండ్ మేళం రిజల్ట్.. కోన వెంకట్ ఏమంటారో మరి? ఈ విషయాన్ని అందరికీ అర్థమయ్యేలా ఆయన రెండు అద్భుతమైన ఉదాహరణలతో వివరించారు. ఇల్లు కట్టేటప్పుడు స్లాబ్ వేసిన వెంటనే వర్షం పడితే అది ఎలా నిరుపయోగం అవుతుందో.. అలాగే పాలు పెరుగుగా తోడుకుంటున్న సమయంలో ఒక్క చుక్క నిమ్మరసం పడితే ఎలా విరిగిపోతాయో చిరు లైవ్ ఎగ్జాంపుల్స్ చెప్పారు. కానీ స్లాబ్ ఆరిన తర్వాత నీరు పడినా, పాలు పెరుగుగా మారిన తర్వాత నిమ్మకాయ కలిపినా అవి మేలే చేస్తాయి. అంటే.. మనం ఇంకా నిలదొక్కుకుంటున్న సమయంలో వచ్చే విమర్శలు మన భవిష్యత్తును దెబ్బతీస్తాయని ఆయన విశ్లేషించారు. కియరా లుక్‌కి అనన్య అసూయ చూసారా! ప్రతికూల పరిస్థితులను తమకు అనుకూలంగా మార్చుకోవడం వల్లే తనకు ఈ స్థాయి మానసిక స్థైర్యం వచ్చిందని చిరంజీవి స్పష్టం చేశారు. నెగటివిటీకి దూరంగా ఉంటూ.. కేవలం లక్ష్యం వైపు దృష్టి సారించడం ద్వారానే విజయం సాధ్యమవుతుందని చిరు సందేశాన్ని ఇచ్చారు. నిరంతరం మనల్ని మనం ప్రోత్సహించుకుంటూ.. సానుకూల మనుషుల మధ్య ఉంటేనే అనుకున్నది సాధించగలమని ఈ వీడియో ద్వారా అతడు తెలియజేశారు. మెగాస్టార్ చిరంజీవిలో ఉండే పాజిటివిటీ ఆయన అభిమానులతో పాటు ప్రజలందరిలో పాజిటివ్ ఎనర్జీని నింపుతుంది. మెగాస్టార్ చిరంజీలో ఈ పాజిటివిటీని నింపినది ఆధ్యాత్మికత. అన్ని కష్ట సమయాల్లోను తనను ఆంజనేయస్వామి తనను ఆదుకున్నారని చెబుతుంటారు. తనకు ఏ కష్టం వచ్చినా ఆంజనేయుడికి చెప్పుకుంటానని చిరు చాలా సందర్భాల్లో చెప్పారు.

# దిశా పటానీ అందాలకు సోషల్ మీడియాలో క్రేజ్.. ఫ్యాన్స్ ఫిదా

వరుణ్ తేజ్ నటించిన 'లోఫర్' సినిమాతో దిశా పటానీ తెలుగు ప్రేక్షకులకు పరిచయమైంది.

బాలీవుడ్ హాట్ బ్యూటీ దిశా పటానీ తన గ్లామరస్ లుక్స్‌తో ఇంటర్నెట్‌ను షేక్ చేస్తోంది. తెలుగులో 'లోఫర్' సినిమాతో ఎంట్రీ ఇచ్చి, రీసెంట్‌గా 'కల్కి 2898-ూణ'లో ప్రభాస్ సరసన మెరిసిన ఈ భామ, అటు సినిమాలతోనూ ఇటు హాట్ ఫోటోషూట్‌లతోనూ ఎప్పుడూ వార్తల్లో నిలుస్తోంది. తాజాగా దిశా పోస్ట్ చేసిన మైండ్ బ్లాక్ అయ్యే పిక్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో సెన్సేషన్ క్రియేట్ చేస్తున్నాయి. ఆమె అందచందాలకు నెటిజన్లు ఫిదా అవుతూ లైకులు, కామెంట్లతో హోరెత్తిస్తున్నారు. ఆ విశేషాలు చూద్దాం .. పాత సిద్ధాంతాలు చచ్చాయి.. వాటినే పట్టుకుంటే అంతమే: ఆర్జీవీ-ూ౦జవతీఅంవఎవత్ టాలీవుడ్ ఎంట్రీ నుండి పాన్ ఇండియా స్టార్ వరకు : వరుణ్ తేజ్ నటించిన 'లోఫర్' సినిమాతో దిశా పటానీ తెలుగు ప్రేక్షకులకు పరిచయమైంది. మొదటి సినిమాతోనే తన క్యూట్ అండ్ హాట్ లుక్స్‌తో కుర్రాళ్ల మనసు దోచుకుంది. ఆ తర్వాత బాలీవుడ్‌లో వరుస అవకాశాలు అందుకుంటూ స్టార్ హీరోయిన్‌గా ఎదిగింది. ఇక పాన్ ఇండియా రెబల్ స్టార్ ప్రభాస్ సరసన 'కల్కి 2898-ూణ'లో నటించి మరోసారి టాలీవుడ్ వెండితెరపై మెరిసింది.ఇక సూర్య కంగువ మూవీ లో నటించి మెప్పించింది.ఇక గ్లోబల్ లెవల్ ప్రాజెక్టుల్లో భాగమవుతూ తన క్రేజ్‌ను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్తోంది. బ్యాండ్ మేళం రిజల్ట్.. కోన వెంకట్ ఏమంటారో మరి? సోషల్ మీడియాలో గ్లామర్ విందు: దిశా పటానీకి సోషల్ మీడియాలో ఉన్న ఫాలోయింగ్ అంతా ఇంతా కాదు. ఎప్పటికప్పుడు తన ఫిట్‌నెస్ వీడియోలను, గ్లామరస్ ఫోటోలను షేర్ చేస్తూ ఫ్యాన్స్‌ను ఖుషీ చేస్తూ ఉంటుంది. తాజాగా ఆమె షేర్ చేసిన ఫోటోల్లో మెరిసే డ్రెస్ వేసుకుని, తన ఎద అందాలతో కుర్రాళ్లకు మెంటలెక్కించేలా స్టిల్స్ ఇచ్చింది. ఈ ఫోటోలు చూసిన వారెవరైనా దిశా అందానికి దాసోహం అనాల్సిందే. నెట్టింట మంటలు పుట్టించడంలో ఈమె రూటే సెపరేట్ అని నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు. కియరా లుక్‌కి అనన్య అసూయ చూసారా! బ్రాండ్ ఎండార్స్‌మెంట్స్.. స్పెషల్ షోలతో బిజీ: కేవలం సినిమాలే కాకుండా, దిశా పటానీ టాప్ బ్రాండ్లకు అంబాసిడర్‌గా వ్యవహరిస్తూ కోట్లు గడిస్తోంది. ఫిట్‌నెస్ ఫ్రీక్ కావడంతో స్పోర్ట్స్ వేర్ మరియు ఫ్యాషన్ బ్రాండ్ల ప్రకటనల్లో ఈమెకు డిమాండ్ ఎక్కువగా ఉంది. అలాగే పలు స్పెషల్ షోలు, ఈవెంట్లలో తన డాన్స్ పర్ఫార్మెన్స్‌తో స్టేజ్‌పై నిప్పులు చెరుగుతుంది. ఇక బాలీవుడ్ టాప్ హీరోల సినిమాల్లో నటిస్తూనే, మరోవైపు గ్లామర్ షోతో తన పాపులారిటీ తగ్గకుండా జాగ్రత్త పడుతోంది. నెగెటివ్ మనుషులకు దూరంగా ఉండండి: చిరంజీవి మొత్తానికి దిశా పటానీ అటు వెండితెరపై, ఇటు సోషల్ మీడియాలోనూ తన హవా కొనసాగిస్తోంది. నటనతో పాటు తన పర్ఫెక్ట్ ఫిజిక్‌తో యూత్ ఐకాన్‌గా మారింది. ప్రస్తుతం చేతిలో మరిన్ని క్రేజీ ప్రాజెక్టులు ఉన్న ఈ భామ, రాబోయే రోజుల్లో ఇంకెన్ని రికార్డులు సృష్టిస్తుందో చూడాలి. ఇక ఏదేమైనా దిశా పటానీ అప్‌డేట్ వచ్చిందంటే చాలు, నెటిజన్లు ఆ ఫోటోలపై ఒక లుక్కేయకుండా ఉండలేరు. ఈ బాలీవుడ్ భామ అందాలకు ఫిదా అవ్వని వారుండరంటే అతిశయోక్తి కాదు!

# ఫ్లాప్స్ తర్వాత వరుణ్ తేజ్ బిగ్ రిస్క్! చెల్లితో కలిసి కొత్త గేమ్ ప్లాన్



మెగా ఫ్యామిలీ నుంచి మరో ఆసక్తికరమైన కాంబినేషన్ రాబోతుంది. అయితే ఈ సారి కాంబినేషన్ హీరో-నిర్మాతగా అది కూడా చెల్లీ అన్న కలిసి. మెగా డాటర్ నిహారిక కొణిదెల- వరుణ్ తేజ్ ప్రాజెక్ట్ ఇప్పటికే ఇండస్ట్రీలో చర్చనీయాంశంగా మారింది. అన్నా చెల్లెళ్లుగా వ్యక్తిగతంగా ఉన్న బంధం ఇప్పుడు ప్రొఫెషనల్‌గా కూడా రూపుదిద్దుకోవడం ఈ ప్రాజెక్ట్‌కు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. మెగా ఫ్యాన్స్‌కు ఇది కేవలం మరో సినిమా కాదు, ఒక ఫ్యామిలీ కలయికగా భావించే అవకాశముంది. అందుకే ఈ సినిమాపై అంచనాలు గణనీయంగా పెరుగుతున్నాయి. వాలీబాల్ నేపథ్యంలో. ఈ సినిమాను వాలీబాల్ నేపథ్యంతో తెరకెక్కించనున్నట్టు సమాచారం. టాలీవుడ్‌లో స్పోర్ట్స్ డ్రామాలు అరుదుగా వస్తుంటాయి. వచ్చినప్పుడు కూడా అవి కంటెంట్ బలంపై ఆధారపడి నిలబడాలి. ఈ నేపథ్యంలో వాలీబాల్ లాంటి టీమ్ గేమ్‌ను కథకు కేంద్రంగా ఎంచుకోవడం ఆసక్తికరం. స్పోర్ట్స్ డ్రామాల్లో సాధారణంగా కనిపించే ఎమోషన్, టీమ్ స్పిరిట్ లాంటి అంశాలను కొత్తగా ప్రెజెంట్ చేయగలిగితే, ఈ సినిమా ప్రత్యేక గుర్తింపు పొందే అవకాశం ఉంది. యదు వంశీ దర్శకత్వంలో. ఈ ప్రాజెక్ట్‌కు దర్శకత్వం వహిస్తున్న యదు వంశీ ఇప్పటికే నిహారిక బ్యానర్ లోనే కమిటీ కుర్రోళ్ళుతో తన స్టోరీటెల్లింగ్ శైలిని నిరూపించుకున్నాడు. ఆ సినిమాలో యూత్ ఎమోషన్స్ ను సహజంగా చూపించిన విధానం మంచి స్పందన తెచ్చుకుంది. అదే టీమ్ ఇప్పుడు మరోసారి కలిసి పనిచేయడం ఈ ప్రాజెక్ట్‌కు అదనపు బలాన్ని చేకూస్తుంది. ఒకసారి సక్సెస్ అయిన కాంబినేషన్ మళ్లీ రావడం వల్ల, కథనం మరియు ట్రీట్‌మెంట్ విషయంలో ఒక స్థిరత్వం ఉండే అవకాశముంది. ప్రయోగాలు చేస్తున్న వరుణ్ మరోవైపు, వరుణ్ తేజ్ తన కెరీర్‌లో విభిన్న జానర్లను ఎంచుకుంటూ ముందుకు సాగుతున్నాడు. కమర్షియల్, యాక్షన్, ప్రయోగాత్మక సినిమాల మధ్య కెరీర్ ను బ్యాలెన్స్ చేస్తూ తనకు ప్రత్యేక ఇమేజ్ ఏర్పరచుకోవడానికి ప్రయత్నిస్తున్నాడు. వాలీబాల్ నేపథ్యంలోని ఈ స్పోర్ట్స్ డ్రామా అతని కెరీర్‌లో మరో కొత్త దిశగా మారే అవకాశం ఉంది. ముఖ్యంగా ఫిజికల్ ట్రాన్స్ఫర్మేషన్, క్యారెక్టర్ డైనమిక్స్ లాంటి అంశాలు అతనికి నటుడిగా మరింత స్కోప్ ఇవ్వవచ్చు. గత కొన్ని సినిమాలుగా వరుణ్ వరుస ఫ్లాపులను ఎదుర్కొంటున్నాడు. ఈ మొత్తం ప్రాజెక్ట్‌కు కేంద్రంగా నిలుస్తోంది పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్. నిహారిక ఆధ్వర్యంలో నడుస్తున్న ఈ బ్యానర్, కేవలం కమర్షియల్ ఫార్ములాలకే పరిమితం కాకుండా కంటెంట్ ఓరియెంటెడ్ సినిమాలపై దృష్టి పెట్టడం ద్వారా ప్రత్యేక గుర్తింపు సాధించే దిశగా అడుగులేస్తోంది. కమిటీ కుర్రోళ్ళు సక్సెస్ తో ఇప్పటికే ఒక బలమైన ప్రారంభాన్ని అందుకున్న ఈ సంస్థ, ఇప్పుడు వరుసగా కొత్త కాన్సెప్ట్‌లను ఎంపిక చేసుకుంటూ బ్రాండ్‌గా ఎదగడానికి ప్రయత్నిస్తోంది. మొత్తంగా చూస్తే, మెగా ఫ్యామిలీ కాంబినేషన్, స్పోర్ట్స్ డ్రామా కాన్సెప్ట్, సక్సెస్‌ఫుల్ డైరెక్టర్ రిపీట్, వరుణ్ తేజ్ కెరీర్‌లో కొత్త ప్రయోగం, అలాగే కంటెంట్ ఓరియెంటెడ్ ఇవన్నీ కలిపి ఈ ప్రాజెక్ట్‌ను రాబోయే రోజుల్లో ఈ సినిమాకు సంబంధించిన మరిన్ని వివరాలు బయటకు రానున్న నేపథ్యంలో, అంచనాలు మరింత పెరగడం ఖాయం.